# ప్రజా మంటలు


తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 213 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 11 - 02 - 2026




రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా మాదాపూర్ ఎస్సై వినయ్‌ని పట్టుకున్న ఏసీబీ అధికారులు




## సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా వేదనకు గురి చేయడం సరికాదన్న బండి సంజయ్
- ప్రభుత్వం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన
- హైదరాబాద్ నడిబొడ్డున ఆందోళన, దీక్ష చేస్తామని హెచ్చరిక



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం సరికాదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. పదవీ విరమణ చేసి రెండేళ్లయినా బెనిఫిట్స్ బకాయిలను చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. రిటైర్డ్ అయ్యాక ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మానసిక వేదనకు గురి చేస్తుండటం క్షమించరాని నేరమని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే బెనిఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. తక్షణమే వారి బకాయిలను - మిగతా 2 లో

## రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- హైదరాబాద్‌లో కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా
- ఆక్రమణలపై నగరం నలువైపులా హైడ్రా చర్యలు
- కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా
- అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు 8 ఎకరాల మేర తొలగింపు
- రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా
- జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు ఫెన్సింగ్



హైదరాబాద్ : హైదరాబాద్‌లో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా రూ.1,511 కోట్ల విలువైన భూమిని రక్షించింది. ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది. ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా... పార్కులు, చెరువులను ఆక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది.

**కొండాపూర్‌లో చెరువును కాపాడిన హైడ్రా**

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం - మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన - మిగతా 2 లో



## వాయుసేనకు 114 కొత్త రఫేల్స్

- రూ.3.25 లక్షల కోట్ల మెగా డీల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్!
- భారత వాయుసేన కోసం 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు రంగం సిద్ధం
- రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందానికి త్వరలో రక్షణ శాఖ ఆమోదం
- ఒప్పందంలో భాగంగా సుమారు 100 యుద్ధ విమానాల దేశీయ తయారీ
- హైదరాబాద్‌లో టాటా సంస్థ ఆధ్వర్యంలో కీలక భాగాల ఉత్పత్తి

## అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను

- స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం!
- లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్షాల అవిశ్వాస తీర్మానం నోటీసు
- ఈ విషయం తేలేదాకా విధులకు దూరంగా ఉంటానన్న ఓం బిర్లా
- ఇది తన నైతిక బాధ్యత అని, చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేసిన స్పీకర్
- మార్చి 9న అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశం
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(C) కింద ఈ నోటీసును సమర్పించాయి
- సుమారు 120 మంది విపక్ష ఎంపీల సంతకాలు



ఢిల్లీ : లోక్‌సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తనపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, పరిష్కారం లభించేంత వరకు స్పీకర్ స్థానంలో కూర్చోకూడదని ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇది తన నైతిక బాధ్యత అని, స్పీకర్ స్థానంపై సందేహాలు వ్యక్తమైనప్పుడు తక్షణం చర్చ జరగాలనే సందేశం ఇవ్వడానికే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ పార్టీ సహా ఇతర విపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇటీవల 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(C) కింద ఈ నోటీసును సమర్పించాయి. దీనిపై సుమారు 120 మంది విపక్ష ఎంపీలు - మిగతా 2 లో

## వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళతాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్ర సహకారంతో వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళతాంమన్న సీఎం చంద్రబాబు
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళ్లేందుకు సలహాలు కోరానన్న సీఎం
- దేశ వ్యవసాయ జీడీపీలో ఏపీ వాటా దాదాపు 10 శాతం అని వెల్లడి
- ఏపీ అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కేంద్రమంత్రి ఆదేశం
- చంద్రబాబు నాయకత్వంలో ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారిందన్న శివరాజ్ సింగ్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని మరో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్రం మార్గనిర్దేశం చేయాలని కోరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మంగళవారం సమావేశమయ్యారు. - మిగతా 2 లో



## లిబియా తీరంలో వలసదారుల పడవ మునక.. 53 మంది మృతి

- లిబియా తీరంలో రబ్బరు బోటు బోల్తా
- 55 మంది వలసదారులలో 53 మంది మృతి
- మృతుల్లో ఇద్దరు పసిపిల్లలు కూడా ఉన్నట్లు వెల్లడి
- ఈ ఏడాది మధ్యధరా సముద్రంలో 500 మంది మరణించినట్లు ఐఓఎం అంచనా
- లిబియాలో నెలకొన్న అరాచకమే కారణమంటున్న నిపుణులు

## సభకు రాకపోవడం ప్రజలను అవమానించడమే



- వైసీపీపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు ఫైర్
- వైసీపీ ఎమ్మెల్యేలపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తీవ్ర విమర్శలు
- చర్చలకు బదులు అరాచకానికే వైసీపీ అలవాటుపడిందని వ్యాఖ్య
- 151 నుంచి 11 సీట్లకు పడిపోవడమే వైసీపీ పాలనకు నిదర్శనం
- 22-ఏను అడ్డుపెట్టుకుని రైతులను వైసీపీ ప్రభుత్వం వేధించిందన్న కాల్వ

అమరావతి : శాసనసభ చర్చలకు దూరంగా ఉండటం అంటే ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అవమానించడమేనని ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం - మిగతా 2 లో

## విశాఖ మెట్రోకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



- 46.22 కి.మీ - 43 స్టేషన్లు
- విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- సీఎం చంద్రబాబుతో భేటీలో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్
- విశాఖ మెట్రో మొదటిదశ ప్రాజెక్టుకు రూ.11 వేల కోట్లు ఖర్చు
- మెట్రోను మొదటి దశలో 3 కారిడార్లలో నిర్మించాలని డీపీఆర్ సిద్ధం
- 3 కారిడార్లలో కలిపి మొత్తం 46.22 కి.మీ, 43 మెట్రో స్టేషన్లు
- విశాఖ, విజయవాడలో మెట్రోకు ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ ప్రతిపాదన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్య విధానంలో ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం చెరిసగం

అమరావతి : విశాఖ మెట్రో రైలుకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి మనోహర్ లాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ లాల్ స్వయంగా ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ, విజయవాడ మెట్రోకు ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో మెట్రోకు పచ్చజెండా ఊపినట్లు సీఎంకు కేంద్రమంత్రి తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, ప్రయాణాన్ని సులభతరం చేయడానికి ఈ మెట్రో ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగనుంది. విశాఖ మెట్రో మొదటిదశ ప్రాజెక్టుకు రూ.11 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మెట్రోను మొదటి దశలో 3 కారిడార్లలో నిర్మించాలని డీపీఆర్ సిద్ధం చేశారు. 3 కారిడార్లలో కలిపి మొత్తం 46.22 కి.మీ, 43 మెట్రో స్టేషన్లను నిర్మించనున్నారు. అలానే ఈ మెట్రో ప్రాజెక్టును డబుల్ డెక్కర్ విధానంలో నిర్మించేలా డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టులో ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతువాక వద్ద ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి.

**మొదటిదశలో 3 కారిడార్లు:**

కూర్మన్నపాలెం-కొమ్మాది జంక్షన్ మధ్య మొదటి మెట్రో లైను 34.4 కి.మీ, 29 మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి.

గురుద్వారా-పాత పోస్టాఫీసు మధ్య 2వ మెట్రో లైను రానుంది. ఈ కారిడార్‌లో - మిగతా 2 లో

# సంపాదకీయం

## సాహసోపేతమేగానీ...



సహనం, ఓర్పు, సంయమనం, ప్రయామం, నిగ్రహం ఎదుటివారు ఎంతగా రెచ్చగొడుతున్నా మాట తూలకు ండా ప్రశాంతంగా ఉండే స్థితిని చెప్పటానికి ఇలా బోలెడు పదాలున్నాయి. కనీసం ఆర్నెల్లుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయినట్టేనని తరచు చెబుతూవచ్చారు. అందుకు మన దేశంనుంచి ఆశాజనకమైన స్పందన రానప్పుడల్లా రెచ్చిపోయి మాట్లాడారు. పాకిస్తాన్ పౌర, సైనిక అధినేతల్ని నెత్తినెక్కించుకుని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. జమ్మూకశ్మీర్ భౌగోళిక చిత్రపటాన్ని పాకిస్తాన్ సంబరపడేలా మార్చేశారు. ఎన్ని చేసినా మన ప్రభుత్వం మౌనంగా ఉండిపోవటం, లేదా ఆచితూచి మాట్లాడటం పనికొచ్చినట్టుంది. ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారతఅమెరికాల మధ్య ఒక అవగాహన కుదిరిందని మొన్న శనివారం అధికారికంగా ఉమ్మడి ప్రకటన వెలువడింది. అందుకు సంబంధించిన ఒక అమరిక (ఫ్రేమ్‌వర్క్) కూడా రూపొందింది. అంతే... వెనువెంటనే 25 శాతం అదనపు సుంకాలు రద్దయ్యాయి. ఇకపై సుంకాలు 18 శాతానికి మాత్రమే పరిమితమవుతాయని అమెరికా ప్రకటించింది. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితి అలముకున్న తరుణంలో మన దేశం ఈ మాదిరి ఒప్పందానికి సంసిద్ధం కావటం ఒక సాహసోపేతమైన చర్య. అయితే 'ఇల్లలకగానే పండగ కాద'న్నట్టు ఈ ఒప్పందం వాస్తవ రూపం దాల్చేవరకూ ఒకింత ఉత్కంఠ, సంశయం తప్పవు. అటు తర్వాత కూడా దిన దిన గండం ఉండనే ఉంటుంది. అక్కడున్నది ట్రంప్ గనుకే ఈ సమస్య. ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు గమనిస్తే ఇది తెలుస్తుంది. 'భారత్ ఇకపై రష్యా నుంచి చమురు కొనడం ఆపేసి, ఆ ఉత్పత్తులను అమెరికా నుంచే కొంటుందని ఆశిస్తున్నామ'ని అందులో ఉంది. భారత రష్యా చమురు వాణిజ్యంపై తమ నిఘా ఉంటుందని కూడా అంటున్నది. ఈ విషయంలో మన దేశం అధికారికంగా ఏమీ చెప్పలేదు. ఉమ్మడి ప్రకటనలోనూ ఆ ప్రస్తావనలేదు. కానీ జాతీయ ఇంధన ప్రయోజనాలే మన గీటురాయి అని గతంలో మోదీ అన్నారు. మన వ్యవసాయ, పాడి రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టే ప్రశ్నే లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ చెబుతున్నారు. అలాగే అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు సుంకాలు తగ్గించబోమంటున్నారు. అయితే ఉమ్మడి ప్రకటనలో అమెరికాకు సంబంధించిన అన్ని పారిశ్రామిక సరుకులు, విస్తృతశ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు లేదా రద్దు చేయటానికి భారత్ అంగీకరించిందని ఉంది. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. లేనట్టయితే భారత్ వెనక్కి తగ్గిందని ట్రంప్ యాగీ చేయటంతోపాటు, అదనపు సుంకాలకు సాకుగా ఉపయోగించుకుంటారు. ప్రస్తుత భారతఅమెరికా వాణిజ్యం 13,000 కోట్ల డాలర్ల మేర ఉంది. ఇందులో అమెరికాకు మన ఎగుమతులు 8,500 కోట్ల డాలర్ల వరకూ ఉంటే, అమెరికా నుంచి దిగుమతులు 4,500 కోట్ల డాలర్ల వరకూ ఉన్నాయి. అంటే మనం 4,000 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులులో ఉన్నాం. దీన్ని మార్చాలన్నదే ట్రంప్ తాపత్రయం. అందుకే వచ్చే అయిదేళ్లలో అమెరికా నుంచి 50,000 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులుండేలా ఒప్పందం నిర్దేశిస్తోంది. ఇంధనం ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, సాంకేతిక ఉత్పత్తులు, అరుదైన లోహాల వంటివి ఉంటాయంటున్నారు. అంటే ఆ దేశంనుంచి ఏటా అదనంగా వందకోట్ల డాలర్ల అదనపు ఉత్పత్తులు వస్తాయి. అప్పుడు మన వాణిజ్య మిగులు ఆవిరై, లోటులో పడుతుంది. దీన్ని ఏ విధంగా సర్దుబాటు చేస్తారు? కార్మికుల అవసరం ఎక్కువుండే మన ఉత్పత్తులకు ఒప్పందం వల్ల భారీ ప్రయోజనం కలిగే అవకాశమైతే ఉంటుంది. ఆ రకంగా దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగవు తాయి. ఇక జన్యుమార్పిడి ఆహారం అనారోగ్యహేతువని, ఆ విత్తనాల వల్ల దిగుబడి భారీగా వచ్చినా, అవి వాడిన పంటపొలాల్లో భవిష్యత్తులో దేశీయ విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉండదని గతంలో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఆ విషయంలో సందే హాలన్నీ నివృత్తి చేయాలి. అలాగే తుది ఒప్పందం సమయానికి అవసరమైన మార్పులు, చేర్పులకు ఇరుపక్షాలూ సిద్ధపడే షరతుపైనే ఏ ఒప్పందంపైనైనా సంతకం చేయాలి.

## సభకు రాకపోవడం ప్రజలను అవమానించడమే

**మొదటిపేజీ తరువాయి** – మీడియాతో మాట్లాడారు. శాసనసభ్యులుగా తమ ప్రాథమిక బాధ్యతలను వైసీపీ నేతలు పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. గత నాలుగు సమావేశాలకు డుమ్మా కొట్టిన వైసీపీ, చర్చల స్థానంలో అరాచక ప్రవర్తనకే అలవాటు పడిందని కాల్వ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రోజు మొక్కుబడిగా సభకు వచ్చి, కాగితాలు చించి గందరగోళం సృష్టించడం తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడింది లేదని దుయ్యబట్టారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనను చూసిన ప్రజలు, కూటమికి 164 స్థానాలిచ్చి చారిత్రక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినప్పటికీ వైసీపీ తన తీరు మార్చుకోకపోవడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 22–ఏ నిబంధనను ఒక ఆయుధంగా మార్చి రైతులను, సామాన్యులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని కాల్వ శ్రీనివాసులు ఆరోపించారు. తమ అవినీతి, భూకబ్జాలపై సభలో సమాధానం చెప్పలేకనే జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉందని, నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ ఎమ్మెల్యేలు తమ బాధ్యతను గుర్తించి, బడ్జెట్ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై గళం విప్పాలని కాల్వ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను

**మొదటిపేజీ తరువాయి** – సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. తన అభిప్రాయాన్ని మంగళవారం వివిధ పార్టీల నేతలకు, ప్రతిపక్ష నాయకులకు కూడా తెలియజేశారు. ప్రభుత్వం గానీ, ప్రతిపక్షాలు గానీ కోరినా తాను తన నిర్ణయాన్ని మార్చుకోబోనని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అవిశ్వాస తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం తొలి రోజైన మార్చి 9న జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు ఓం బిర్లా స్పీకర్ సీటుకు దూరంగా ఉండనున్నారు. పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాసం ఎప్పుడూ నెగ్గనప్పటికీ, తాజా పరిణామంతో బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ం

## హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు

**మొదటిపేజీ తరువాయి** – హైదరాబాద్ శివారులో స్వల్పంగా భూప్రకంపనలు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారంలోని మెట్‌ఖాన్‌గూడ ప్రాంతంలో ఉదయం 10:10 గంటలకు భూమి కంపించినట్లు శబ్దం వచ్చింది. దీంతో ఇళ్లలో ఉన్న ప్రజలు బయటకు పరుగు తీశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గేటెడ్ కమ్యూనిటీ, అపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రకంపనలు రావడంతో వారు ఒక్కసారిగా భయపడి బయటకు వచ్చారు. అయితే ఇది భూమి కంపించడం వల్ల జరిగిందా? లేక చుట్టుపక్కల పేలుడుతో వచ్చిన ప్రకంపనలా అనేది తెలియాల్సి ఉంది. గేటెడ్ కమ్యూనిటీల్లోని సీసీ కెమెరాల్లో భూమి కంపించినట్లు కనిపించింది. స్థానికంగా ఉన్న పాఠశాలకు స్కూల్ యాజమాన్యం సెలవు ప్రకటించింది. స్థానికులు మాట్లాడుతూ, భూమి హఠాత్తుగా కంపించినట్లయిందని, ఏం జరిగిందో తెలియక అందరం బయటకు వచ్చామని చెప్పారు. భారీ శబ్దం వచ్చి భూమి కంపించినట్లు అనిపించిందని అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో రెవెన్యూ, సంబంధిత అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ



**మొదటిపేజీ తరువాయి** – చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేస్తామని అన్నారు.

# విశాఖ మెట్రోకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి** – 5.07 కి.మీ., 6 స్టేషన్లు నిర్మించనున్నారు. తాడిచెట్లపాలెం–చినవాల్తేరు మధ్య 3వ మెట్రో లైను రానుంది. ఈ కారిడార్‌లో 6.75 కి.మీ., 7 మెట్రో స్టేషన్లు రానున్నాయి. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల డీపీఆర్‌లను 2015లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం మొదటిసారి కేంద్రానికి పంపింది. వాటికి అప్పట్లోనే కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. తర్వాత కేంద్రం తీసుకువచ్చిన కొత్త మెట్రో రైలు విధానానికి అనుగుణంగా మళ్లీ డీపీఆర్‌లు సమర్పించాలంటూ వాటిని తిప్పి పంపింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మిగతా ప్రాజెక్టులలాగే మెట్రో ప్రాజెక్టును కూడా తీవ్ర నిర్లక్ష్యం చేసింది. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టును పూర్తిగా అటకెక్కించింది. విశాఖ మెట్రో చేపడతామంటూ కొద్ది రోజులు హడావుడి చేసింది. కానీ ఈ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రానికి మాత్రం ఎలాంటి డీపీఆర్‌లు పంపలేదు. 6 నెలల్లోనే డీపీఆర్‌లు



సిద్ధం: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులకు 6 నెలల్లోనే డీపీఆర్‌లు సిద్ధం చేసింది. 2025 డిసెంబరులో కేంద్రం ఆమోదానికి పంపింది. విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుల్ని 2 దశల్లో చేపడతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్య విధానం (జేవీ మోడల్)లో ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం చెరిసగం భరించాలన్న అంగీకారం గతంలోనే జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు సమకూర్చేందుకు, వాటితో పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. ప్రాజెక్టులో జాప్యాన్ని నివారించేందుకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోగా తన వంతు 20 శాతం నిధులతో భూసేకరణ, సివిల్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టెండర్లు కూడా పిలిచింది. ఆ పనులకు అనుమతుల కోసం 2 నెలల క్రితం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టు కావడంతో రాష్ట్ర నిధులతో చేపట్టే పనులకైనా కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అమరావతి పనులు ఊపందుకోవడం, విశాఖకు గూగుల్, ఐటీ లాంటి దిగ్గజ కంపెనీలు వస్తుండటంతో విజయవాడ, విశాఖలకు మెట్రో ప్రాజెక్టులు అత్యంత అవసరం. వచ్చే ఎన్నికల్లోగా తొలి దశ పనులైనా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళతాం

**మొదటిపేజీ తరువాయి** – ఈ భేటీ చాలా ఫలప్రదంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. "దేశ వ్యవసాయ జీడీపీలో ఆంధ్రప్రదేశ్ వాటా 9.9 శాతంగా ఉంది. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రమంత్రి సలహాలు, సూచనలు కోరాను. మా విజ్ఞప్తి మేరకు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఒక యాక్షన్ ప్లాన్, వాల్యూ–ఎడిషన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని శివరాజ్ సింగ్ తన శాఖ అధికారులను ఆదేశించారు" అని వెల్లడించారు. త్వరలో కేంద్ర బడ్జెట్ రానున్న నేపథ్యంలోనే అన్ని శాఖల మంత్రులతో సమావేశమవుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా దాదాపు 10 శాతం ఉందని ప్రశంసించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం హార్టికల్చర్ హబ్‌గా ఎదుగుతోందని, బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలను వేగంగా అమలు చేస్తోందని కొనియాడారు. ఈ భేటీపై సీఎంవో కూడా ప్రకటన చేసింది. అందులో పేర్కొన్న మేరకు... రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చంద్రబాబు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చించారు. సేంద్రీయ సాగుపై ప్రత్యేక దృష్టి సారించామని, 2024–25 సంవత్సరంలో సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని చంద్రబాబు ఆయనకు తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించినందున ర్యావీ–ప్రా–ణాచీూవీ ప్రోత్సాహకాలను ఇవ్వాలని కోరారు. కొబ్బరి సాగు అభివృద్ధి చేయడానికి రూ. 200 కోట్ల మేర సాయం చేయాలని, కోకోనట్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు ఆధునాతన పద్దతులపై ట్రైనింగ్, నర్సరీల విస్తరణకు సహకరించాలని అన్నారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం పెండింగ్ లో ఉన్న రూ.695 కోట్లు విడుదల చేయాలని, ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ సిస్టం కింద



2025–26 సీజన్‌లో తోతాపూరి మామిడికి కేంద్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.100 కోట్ల సాయాన్ని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో మఖానా డెవలప్ మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని, కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50 వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉన్నందున ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు.

# వాయుసేనకు 114 కొత్త రఫేల్స్

**మొదటిపేజీ తరువాయి** – భారత వాయుసేన అమ్ములపొదిని మరింత పదును పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. మల్టీ–రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్‌ఎఫ్‌ఏ) కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఈ వారంలోనే ఆమోదం తెలిపే అవకాశం ఉంది. సుమారు రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం దేశ రక్షణ రంగ చరిత్రలోనే అతిపెద్దది కానుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందే ఈ కీలక పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఒప్పందం కేవలం విమానాల కొనుగోలుకే పరిమితం కాదు. ఇందులో భాగంగా దాదాపు 100 యుద్ధ విమానాలను "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం కింద దేశీయంగానే తయారు చేయనున్నారు. అత్యాధునిక ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే నిబంధనలు కూడా ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ డీల్ ఖరారైతే ఫ్రాన్స్ తర్వాత రఫేల్ యుద్ధ



విమానాలను అత్యధిక సంఖ్యలో వినియోగిస్తున్న దేశాలలో ఒకటిగా భారత్ నిలుస్తుంది. భారత్ వద్ద ఇప్పటికే 36 రఫేల్ 'జ' వేరియంట్ ఫైటర్ జెట్లు ఉన్నాయి. 2024 డిసెంబర్‌లో చివరి విమానం వాయుసేనకు అందింది. ఈ జెట్లను అంబాలాలోని 'గోల్డెన్ యారోస్' (నెం.17 స్క్వాడ్రన్), బెంగాల్‌లోని హసిమారాలో ఉన్న 'ఫాల్కన్స్' (నెం.101 స్క్వాడ్రన్)లలో మోహరించారు. వీటితో పాటు రూ.63,000 కోట్లతో 26 నేవల్ వేరియంట్ (రఫేల్–వీ) జెట్ల కొనుగోలుకు కూడా భారత్ ఆర్డర్ ఇచ్చింది. ఈ నేవల్ వేరియంట్ జెట్లను ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య విమాన వాహక నౌకలపై మోహరిస్తారు.

**టాటా భాగస్వామ్యంతో దేశీయ ఉత్పత్తి**

మేక్ ఇన్ ఇండియాలో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించనుంది. రఫేల్ జెట్‌కు సంబంధించిన ఫ్యూజ్‌లేజ్ సెక్షన్లను ఇక్కడ తయారు చేస్తారు. 2028 నాటికి మొదటి ఫ్యూజ్‌లేజ్ సెగ్మెంట్లు తయారవుతాయని, నెలకు రెండు పూర్తి ఫ్యూజ్‌లేజ్‌లను అందించాలనే లక్ష్యంతో పనిచేయనున్నట్లు తెలుస్తో ంది. అంతిమ అసెంబ్లింగ్ ఫ్రాన్స్‌లోని డస్సాల్ట్ ఏవియేషన్ ఫెసిలి టీలో జరుగుతుంది. గతేడాది మేలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పం దనగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో, అలాగే లధక్‌లో కూడా రఫేల్ జెట్లు తమ సత్తా చాటాయి. 250 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల 'స్కాల్ప్' క్రూయిజ్ క్షిపణులను ఈ ఆపరేషన్‌లో రఫేల్స్ ప్రయోగించినట్లు సమాచారం. ఈ యుద్ధ విమానాలు మెటియోర్, హ్యామర్ వంటి శక్తిమంతమైన క్షిపణులను కూడా మోయగలవు. ఈ భారీ ఒప్పందంతో భారత రక్షణ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది.

# లిబియా తీరంలో వలసదారుల పడవ మునక.. 53 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి** – లిబియా తీరంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. వలసదారులు, శరణార్థులతో వెళుతున్న ఒక రబ్బరు బోటు మధ్యధరా సముద్రంలో మునిగిపోవడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) అధికారికంగా ధృవీకరించింది. లిబియాలోని అల్–జావియా నుంచి గురువారం రాత్రి 55 మందితో ఈ బోటు బయలుదేరింది. ప్రయాణం మొదలైన ఆరు గంటల తర్వాత, జువారా తీరానికి సమీపంలో బోటులోకి నీరు చేరి మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో నైజీరియాకు చెందిన ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో ఒకరు తన భర్తను కోల్పోగా, మరొకరు తన ఇద్దరు పిల్లలను కోల్పోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ఘటన గత గురువారం జరిగినా, ఐఓఎం సోమవారం దీన్ని వెలుగులోకి తెచ్చింది. 2026లో ఇప్పటివరకు మధ్యధరా సముద్రం దాటే ప్రయత్నంలో దాదాపు 500 మంది మరణించడం లేదా గల్లంతవడం జరిగిందని ఐఓఎం తెలిపింది. ముఖ్యంగా శీతాకాలంలో స్మగ్లర్లు నడిపే పడవలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, చాలా సంఘటనలు నమోదు కావడం లేదని పేర్కొంది. 2011లో గడాఫీ మరణం తర్వాత లిబియాలో అస్థిరత పెరిగింది. ఆఫ్రికా దేశాల నుంచి యూరప్ కు వెళ్లే వలసదారులకు ఇది ప్రధాన మార్గంగా మారింది. హింస, దోపిడీ, బలవంతపు చాకిరీ వంటి భయానక పరిస్థితుల నుంచి తప్పించుకునేందుకే ప్రజలు ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలకు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో, మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను అరికట్టడంతో



పాటు, వలసలకు చట్టబద్ధమైన, సురక్షితమైన మార్గాలను ఏర్పాటు చేయాలని ఐఓఎం అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది.

# రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

**మొదటిపేజీ తరువాయి** – కబ్జాదారుల ఆట కట్టించింది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఫెన్సింగ్ వేసింది.

**అల్వాల్ కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు**

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

**1100 గజాల పార్కులను కాపాడిన హైడ్రా**

వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 గజాల మేర పార్కుకోసం కేటాయించారు. 1985లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఆక్రమణలు తొలగించి పార్కు చుట్టూ



ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.

# నా మాటలు ఎలా లీక్ అయ్యాయి..?

**బీఆర్ఎస్ ఇప్పటికీ ఫోన్ ట్యాప్ చేస్తోందేమో!: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**బీఆర్ఎస్ నేతలపై మంత్రి అనుమానాలు**

**సమీక్షలో మాట్లాడిన మాటలు లీక్ అయ్యాయని వ్యాఖ్య**

**ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎవరు విన్నారో విచారణ చేయిస్తానని వెల్లడి**



బీఆర్ఎస్ నేతలు ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారేమోననే అనుమానం వస్తోందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాను సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ అయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం పురపాలక ఎన్నికలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ కావడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎలా విన్నారో పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తానని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం

## కర్ణాటక స్టేట్కి పత్తిపాక యువశక్తి యూత్ సభ్యుడు మహమ్మద్ ఇర్ఫాన్ ఎంపిక



**గొల్లపల్లి ఫిబ్రవరి 10(ప్రజా మంటలు** :పెద్దపల్లి జిల్లా నుండి ఇద్దరు యువకులను మహమ్మద్ ఇర్ఫాన్ దుడ్డల రాజ్ కుమార్ ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కర్ణాటక కు ఎంపికైనా సందర్భం గా మై భారత్ మేరా యువభారత్ యువశక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. యూత్ సభ్యుడు మహమ్మద్ ఇర్ఫాన్ కర్ణాటకలో ఈనెల 12 నుంచి 16 వరకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని మన ప్రాంత ప్రతిభను చాటనున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహేష్ అధ్యక్షులు సిద్ధార్థ్ జనరల్ సెక్రెటరీ రిషి ప్రచార కార్యదర్శి రాకేష్ కుమార్ నరేష్ యూత్ సభ్యులు గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ఘనంగా 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)** :మండలంలోని గట్ల నర్సింగాపూర్ ఉన్నత పాఠశాలలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉపన్యాసాలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు డోరి రమేష్ మాట్లాడుతూ, తెలంగాణహర్యానా రాష్ట్రాల ప్రజల సంప్రదాయాలు, వేషాలంకరణలు పరస్పరం పంచుకోవడం, భాషల తీయదనాన్ని తెలుసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు మాదాసు విజయకుమార్, లలిత, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, నవీన్, లక్ష్మణ్ శ్రీనివాస్, సంపత్, కావేరీ, ఏవో రామకిషన్ రాజు విద్యార్థులకు అమూల్య సందేశాలు అందిస్తూ అభినందనలు తెలిపారు. విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భీమదేవరపల్లిలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ




**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)** :మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి పంపిణీ చేశారు. బొక్కల తిరుపతమ్మ, ఎలుకపెల్లి రాజేశ్వరి, గుండేటి లక్ష్మీలకు చెక్కులను అందజేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా గ్రామపంచాయతీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. శ్రీధర్, ఉపసర్పంచ్ ఐలయ్య, జీపీఓ సారంగపాణి, సెక్రటరీ రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, లలిత, పోలు అశోక్, వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, విజయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల బస్సులపై ప్రత్యేక తనిఖీలు

## ప్రమాదాల నివారణకు చర్యలు

## పోయిన మొబైల్‌ను యజమానికి అందజేత







**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)** :విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవసరమైన తనిఖీలు చేపట్టినట్లు ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు. బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్స్, వాహన పత్రాలు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలను పరిశీలించి, నిబంధనలు పాటించాలని డ్రైవర్లు, పాఠశాల నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా, ఇటీవల కోల్పోయిన ఒక మొబైల్ ఫోన్‌ను గుర్తించి యజమానికి అందజేశారు. ప్రజలు తమ వస్తువులు కోల్పోయిన సందర్భంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

# మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్



**జగిత్యాల /మెట్పల్లి/ కోరుట్ల ఫిబ్రవరి 10 ప్రజా మంటలు** :మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు .మంగళవారం రోజున మెట్‌పల్లి, కోరుట్ల మరియు జగిత్యాల పట్టణాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన బాధ్యతల పంపిణీ తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన లాజిస్టిక్స్, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో వెబ్కాస్టింగ్ ఉంటుందని పోలింగ్ సరళిని కలెక్టరేట్ నుంచి నేరుగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కలెక్టరేట్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 24 గంటలపాటు టోల్ ఫ్రీ 96662 34383 ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్లు శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి, మదన్ మోహన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు పూర్తి

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)** : ఎన్నికలు నిర్వహణకు 900 మంది పోలీస్ లతో పటిష్ఠ బందోబస్తు.జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా మరియు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు,సిబ్బందితో జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల విధులకు సంబంధించి పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల ప్రాముఖ్యతను వివరిస్తూ, ఎన్నికల విధులు ఏవిధంగా పకడ్బందీగా నిర్వహించాలి అని, సిబ్బంది చేయవలసిన, చేయకూడని విధుల గురించి జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా వివరించారు.ఈ సందర్భం గా ఎస్పీ గారు మాట్లాడుతూ.... జగిత్యాల, రాయికల్, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 136 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు, ఇందుకోసం 379 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల విధుల కోసం 900 మంది పోలీస్ సిబ్బంది నియమించబడినట్లు పేర్కొన్నారు.ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీలు రఘు చందర్, సి.ఐ లు కరుణాకర్,సుధాకర్, రవి, రామ్ నరసింహారెడ్డి,ఆర్.ఐ లు వేణు, మరియు ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు దూషణలకే పరిమితం బడ్జెట్‌లో హామీల అమలు కోరిన జాగృతి కవిత




**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)**:మున్సిపల్ ఎన్నికల ప్రచారం ప్రజా సమస్యలపై కాకుండా వ్యక్తిగత దూషణలకే పరిమితమైందని కవిత విమర్శించారు. నీరు, రవాణా, విద్య, వైద్యం వంటి మౌలిక అంశాలను పూర్తిగా విస్మరించారని అన్నారు. రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ హామీల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 1.89 లక్షల ఉద్యోగాల భర్తీకి బడ్జెట్‌లో ప్రొవిజన్ పెట్టి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు కేటాయించి బీసీ సబ్ ప్లాన్ ప్రకటించాలన్నారు.రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో డ్రైనేజీ, తాగునీరు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ దయనీయ స్థితిలో ఉన్నాయని విమర్శించారు. బస్తీ దవాఖానాల్లో మందులు, డాక్టర్లు లేరని, ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి ఆందోళనకరమని తెలిపారు.రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెన్షన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.లేబర్ కోడ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 12న జరిగే బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సర్దుబాట్లకు ప్రజలు మోసపోవద్దని, మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

# బుగ్గారం మండలం మద్దునూర్ లో చట్టాలపై అవగాహన

## కల్పించిన సఖీ అడ్మినిసేషన్ కటుకూరి లావణ్య



**గొల్లపల్లి ఫిబ్రవరి 10(ప్రజా మంటలు** : బుగ్గారశీ మండలశీలోని మద్దునూరు గ్రామంలో సఖి నిర్వాహకురాలు కట్కూ రి.లావణ్య, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల మరియు శ్రీ వాణివిద్యాలయం లోవి ద్యార్థి ని, విద్యార్థులకు చట్టా లపై అవగాహన నిర్వ హించారుసఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కట్కూరి లావణ్య మాట్లాడుతూ సఖి అందించే ఐదు రకాల సేవలు, ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181 గురించి వివరిస్తూ, బాధిత మహిళ సఖి సెంటర్ కు వస్తే తనకు సఖి సెంటర్లో తాత్కాలిక వసతి. వైద్య కౌన్సిలింగ్ పోలీస్ మరియు డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఫ్రీగా లాయర్ ను ఇచ్చి ఏ విధంగా సహాయం చేస్తారో వివరించడం జరిగింది.పైన పేర్కొన్న సేవలు అన్ని సఖి సెంటర్లో ఉచితంగా అందజేయబడతాయని తెలిపారు డొమెస్టిక్ వైలెన్స్ కేసుని సఖి సెంటర్ ద్వారా కోర్టులో వేసుకోవచ్చు అని వివరించారు గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు,ఆడపిల్లల అక్రమ రవాణా, యాసిడ్ దాడులు కాకుండా ఈ మధ్యకాలంలో బాలికలు మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల గురించి వివరిస్తూ ద్వారా అనుభవించే శిక్షల గురించి బాల బాలికలు మహిళలకూ సొసైటీలో జరిగే అరాచకాల ను ఓడి ఏలా తప్పించుకొని జాగ్రత్తగా ఉండాలి అని వివరించారుఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలిపెల్లి భారతి, మహేష్,కార్యదర్శి బాస్కర్, ఉపసర్పంచు,వార్డ్ సభ్యులు ప్రధానోపాధ్యాయులు మధుకర్, అయ్యోరు చంద్రశేఖర్ ,సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కట్కూరి లావణ్య, పారా మెడికల్ డబ్బెట అనురాధ మహిళా సాధికారత సిబ్బంది స్వప్న గౌతమి తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా శ్రీ వాణి జూనియర్ కళాశాల ఫేర్వెల్ వేడుకలు



**జగిత్యాల ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)** : జగిత్యాల పట్టణము లోని శ్రీవాణి సహకార జూనియర్ కళాశాల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గత విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులను సత్కరించారు. విద్యార్థులు కళాశాలలో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం జే రంగారెడ్డి, కే సంగీత ,ఎన్ జ్యోతి ,మాధురి అరవింద, భాగ్యలక్ష్మి, పి సుధీర్, సురేందర్ ,రాజేందర్ శర్మ విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన

## ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**రాయికల్ ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)** :మండలములోని వీరాపూర్ గ్రామంలో 10 లక్షల నిధులతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ .వీరాపూర్ అనుబంధ గ్రామాలకు అదనపు బస్సు కోసం వినతి కోరగా రవాణా శాఖ మంత్రి తో మాట్లాడి అదనపు బస్సు సర్వీసులు పునరుద్ధరణ కు కృషి చేస్తా అన్నారు ఎమ్మెల్యే.గ్రామంలో నీటి లీకేజీ సమస్య ను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కరించాలని ఎంపీడీవో,సెక్రటరీ నీ ఆదేశించారు ఎమ్మెల్యే.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున రెండు,ఒకటి 30 లక్షల గోదాం మంజూరు చేయటం జరిగింది.వాటిలో గోదాం ,మహిళ సంఘం, కమ్యూనిటీ ఆక్టివిటీ భవనం ఉన్నాయన్నారు.

# ధర్మపురిలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి

## మంత్రి లక్ష్మణ్ కు మాజీ మంత్రి కొప్పుల సవాల్



**జగిత్యాల, ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)**:మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపణలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఘాటుగా స్పందించారు. ధర్మపురి నియోజకవర్గం రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన నియోజకవర్గమని, టెంపుల్ సిటీ అభివృద్ధి ప్రజలందరికీ తెలుసని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 26 నెలలు గడిచినా ధర్మపురి పట్టణం, ఏడు మండలాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని విమర్శించారు. డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, రెవెన్యూ డివిజన్ వంటి హామీల అమలుపై మంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.తమ హయాంలో గురుకుల పాఠశాలలు, ఆసుపత్రి విస్తరణ, రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. నీటి ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటిస్తూ, తన ఆస్తులపై విచారణ చేయాలని కోరారు.

# జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం



**జగిత్యాల, ఫిబ్రవరి 10 (ప్రజా మంటలు)**:జగిత్యాల జిల్లాలో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని 50 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌తో పాటు ముగ్గురు ఇతర పోలింగ్ అధికారులను నియమించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా కోసం 13 మంది మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు.మొత్తం 17 కౌంటర్ల ద్వారా రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ నిర్వహించనున్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు సహా అవసరమైన ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు.

# నేడు మున్సిపల్ ఎన్నికల పోలింగ్

## ఉదయం 7 గంటలకే ప్రారంభం

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం సర్వం సిద్ధం

## బుధవారం ఉదయం 7 గంటల నుంచి

## సాయంత్రం 5 వరకు పోలింగ్

## ఓటింగ్ కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు సిద్ధం

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కి సర్వం సిద్ధమైంది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ఎన్నికల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బ్యాలెట్ పేపర్లు, బాక్సులు, ఇతర ఎన్నిక సామగ్రిని తీసుకొని ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. జిల్లాలన్నింటిలోనూ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. విస్తృతంగా తనిఖీలు చేయాలని ఓట్ల లెక్కింపు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల బృందాలకు ఎస్ఈసీ రాణికుముదిని దిశానిర్దేశం చేశారు. 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవం : బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2,982 వార్డుల్లో 12,930 మంది భవితవ్యం తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత 12,944 మంది బరిలో మిగిలారు. అందులో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మున్సిపాల్టీలు రెండు కార్పొరేషన్లలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పన్నెండు మంది కాంగ్రెస్ ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు.అవసరమైతే మరుసటి రోజు రీ పోలింగ్ : ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు 16,031 బ్యాలెట్ బాక్సులు, 137 స్ట్రాంగ్‌రూమ్‌లు, 136 ఓట్ల లెక్కింపు కేంద్రాల్ని రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం742 మంది జోనల్ అధికారులు 279 ఫ్లయింగ్ స్క్వాడ్, 381 స్క్వాడ్‌బృందాలు, 1370 రిటర్నింగ్ అధికారులు, 1547 ఏఆర్ఓలు 9,560 పోలింగ్ అధికారులు, 31,428 మంది సిబ్బందిని నియమించి శిక్షణ ఇచ్చారు. పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల కోసం సుమారు 25 వేల మంది పోలీసులను సిద్ధం చేశారు. పోలీసులతో పాటు ఎక్సైజ్, అటవీశాఖ సిబ్బందిని భద్రత కోసం వినియోగిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా రీ పోలింగ్ అవసరమైతే మరుసటి రోజు నిర్వహిస్తారు.ఈ నెల 13వ తేదీ ఉదయం 8 నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.



మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక కోసం ఈ నెల14న నోటీసు జారీ చేస్తారు. 16న ఉదయం 11 గంటలకు మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు కార్పొరేషన్లలో కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక నిర్వహిస్తారు.ఓటరు స్లిప్ డౌన్‌లోడ్ ఇలా చేసుకోండి : మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి మొత్తం 52,17,413 ఓటర్లు వారి ఓటును వినియోగించుకోనున్నారు. రేపు పోలింగ్ కోసం 1,379 ఆర్వోలు, 41,773 పోలింగ్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఎస్ఈసీ వెబ్‌సైట్, ఒజు-గాూబూ యాప్ ద్వారా ఓటరు స్లిప్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. పోలింగ్ ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నంబర్ 9240021456 ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.కంట్రోల్‌రూమ్ నుంచి ప్రత్యక్ష పర్యవేక్షణ : మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. రాష్ట్ర బలగాలకు తోడు ఇతర రాష్ట్రాల నుంచి 3వేల మంది పోలీసులను కూడా భద్రత కోసం వినియోగించామని తెలిపారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం

## ఓటుకు నోటు కేసు డాక్యుమెంట్లపై స్పందించిన డీజీపీ

## ఈ కేసులో ఆధారాలను కోర్టుకు సమర్పించినట్లు వెల్లడి

## మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్న డీజీపీ

## ఇప్పటి వరకు రూ.3.09 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి

## బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపిన డీజీపీ

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో విచారణ జరుపుతున్నామని అన్నారు. ఓటుకు నోటు కేసులో కీలకమైన ఫైల్స్ తగలబడిపోయాయనే ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. 2015 నాటి ఈ కేసులో ఆధారాలను 2021లోనే కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ అన్నీ పరిశీలించాకే నివేదికలు ఇచ్చామని అన్నారు.రేపు తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని, హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని డీజీపీ వెల్లడించారు.బందోబస్తు కోసం ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను రప్పించామని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 1,183 లైసెన్స్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని... 4,318 మందిని బైండోవర్ చేశామని, 398 మందికి నాన్-బెయిల్ వారెంట్లు జారీ చేశామని వెల్లడించారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 55 చెక్ పోస్టులు ఉన్నాయని అన్నారు.ఇప్పటి వరకు రూ.3.09 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని డీజీపీ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. 181 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశామని అన్నారు. మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.



# గిరిజన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం

**లంబసింగిలో కుంకుమపువ్వు సాగు**

**గతంలో శాస్త్రవేత్తలు చేపట్టిన ప్రయోగాత్మక సాగులో సత్ఫలితాలు**

**పీపీపీ విధానంలో సాగుపై ప్రభుత్వం ఆసక్తి**

**అవసరమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్న జిల్లా యంత్రాంగం**

**వెయ్యి ఎకరాల్లో సాగు చేసేందుకు ప్రణాళికలు**



కుంకుమపువ్వు పేరు చెప్పగానే మనకు కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ గుర్తుకు వస్తాయి. రైతులకు భారీ లాభాలు తెచ్చిపెట్టే ఈ పంట ఇప్పటివరకు అతి శీతల ప్రాంతాలకే పరిమితమైనది. ఈ పంటను 'ఎర్ర బంగారం' అని కూడా పిలుస్తారు. మన రాష్ట్రంలో అత్యంత విలువైన, లాభదాయకమైన కుంకుమ పువ్వు సాగు వైపు అడుగులు వేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా చేసిన సాగు ప్రయత్నాల్లో మంచి ఫలితాలు వచ్చినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఈ కథనంలో తెలుసుకుందాం.ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో కుంకుమపువ్వు సాగు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పీపీపీ విధానంలో ఈ పంటను సాగు చేసే విధంగా గిరిజనులకు పరిచయం చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇప్పటికే ఆచార్య ఎన్జీ రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా సాగు ప్రయత్నాలు చేశారు. అవి మంచి ఫలితాలు వచ్చినట్లు శాస్త్రవేత్తలు గతంలోనే గుర్తించారు.

**ఇక్కడ వాతావరణం అనుకూలంగా:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లంబసింగి ప్రాంతంలో శీతాకాలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. లంబసింగికి సమీపంలోని చింతపల్లిలోనూ అదే రకమైన వాతావరణం ఉండడం విశేషం. దీంతో అత్యంత శీతల వాతావరణంలోనే కుంకుమపువ్వు పండుతుంది. దీంతో స్థానికంగా ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానంలో 3 ఏళ్ల క్రితం ఈ పంటపై పరిశోధనలు ప్రారంభించారు.

**90 రోజుల వ్యవధిలోనే మంచి ఫలితాలు:** వర్చువల్ స్ప్రింగ్స్ సంస్థ ప్రతినిధులు సాంకేతిక సహకారం అందించారు. దీంతో అప్పటి పరిశోధనా స్థానం సంచాలకురాలు అయిన డాక్టర్ ప్రశాంతి ఎదుట శాస్త్రవేత్తలు కుంకుమపువ్వు సాగు సంబంధించిన ప్రతిపాదనలు ఉంచారు. దీనిపై పైనుంచి అనుమతులు రావడం గమనార్హం. నిధులు విడుదల కావడంతో ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రయోగాత్మక సాగు కోసం కశ్మీర్ నుంచి దాదాపు 200 కేజీలో విత్తనాలను తీసుకు వచ్చి నాటారు. కేవలం 3 నెలల వ్యవధిలోనే మంచి ఫలితాలు సాధించారు.

**గిరిజనులకు ఆదాయ వనరుగా:** తొలుత కుంకుమపువ్వు సాగుపై 3 విధాలుగా పరిశోధనలు చేశారు. అవి ఏమిటంటే గ్లాస్ హౌస్, షెడ్‌నెట్, ఓపెన్ ఫీల్డ్ పద్ధతులు. అప్పట్లో వీటి ద్వారా నాట్లు వేశారు. దీంట్లో షెడ్‌నెట్‌లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయని శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో అల్లూరి జిల్లా కుంకుమపువ్వు సాగుకు అనుకూలమేనని అప్పటి పరిశోధనా స్థానం ఏడీఆర్ ఎం. సురేశ్ కుమార్ ప్రకటించారు. తాజాగా మంత్రులు, ప్రధాన కార్యదర్శుల భేటీలో సీఎం చంద్రబాబు లంబసింగిలో కుంకుమ పువ్వు సాగు చేపట్టనున్నట్లు చెప్పారు.ఈ నేపథ్యంలో ఈ సాగుకు అవసరమైన ప్రణాళికను జిల్లా యంత్రాంగం సిద్ధం చేస్తోంది. గిరిజన రైతులకు ప్రభుత్వం ఆర్థిక, సాంకేతిక సహకారం అందించనుంది. ఎంతో విలువైన ఈ పంట గిరిజనులకు మరింత ఆదాయ వనరుగా నిలవనుంది.సాగుకు ప్రణాళికలు: లంబసింగి, చింతపల్లి, ఆర్.వి. నగర్ ప్రాంతాలు కుంకుమ పువ్వు సాగుకు అనుకూలంగా ఉందని జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గతంలో చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం చేసిన ప్రయోగాలు సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. దాదాపు 1000 ఎకరాల్లో దీన్ని సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దశల వారీగా సాగును పట్టా లెక్కిస్తామన్నారు.

**ఆరోగ్యానికి ఎంతో మేలు:** కుంకుమ పువ్వు మన శరీరంలో వివిధ ఆరోగ్య సమస్యల్ని దూరం చేయడంలోనూ కీలకపాత్ర పాత్ర పోషిస్తుంది. అందుకే పూర్వకాలం నుంచే దీన్ని వివిధ మందుల తయారీలో కూడా వాడుతున్నారు. మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణమవడానికి కుంకుమ పువ్వు ఉపయోగపడుతుంది. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం కలిగేలా చేస్తుంది. కాలేయ, మూత్రపిండ సంబంధిత సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుంది. అంతేకాదు రక్తాన్ని శుభ్రపరచడంలో కూడా తోడ్పడుతుంది.

**పిల్లలకు మంచి రంగు:** గర్భం దాల్చిన మహిళలు కుంకుమ పువ్వును పాలల్లో కలుపుకొని తాగితే పుట్టబోయే బిడ్డ మంచి రంగులో పుట్టే అవకాశం ఉంటుంది. అలాగని ఎక్కువ మోతాదులో తీసుకోకూడదు. అయితే రోజుకి ఎంత తీసుకోవాలన్న విషయంలో వైద్యులను సంప్రదించి నిర్ణయం తీసుకోవడం మంచిది. అలాగే ఈ సమయంలో కొంతమందికి ఎదురయ్యే అజీర్తి సమస్యను తగ్గించి ఆకలిని పెంచడంలో కూడా ఇది తోడ్పడుతుంది. పడుకునే ముందు చిటికెడు కుంకుమ పువ్వును ఆహారంలో వేసుకుని తినడమో లేక పాలల్లో వేసుకుని తాగడమో చేస్తే బాగా నిద్ర పడుతుంది.

**జ్ఞాపకశక్తికి:** కుంకుమ పువ్వులో 'క్రోసిన్' అనే సహజసిద్ధ రసాయన సమ్మేళనం ఉంటుంది. దీనికి జ్వరాన్ని తగ్గించే శక్తి ఉందని పరిశోధకులు వెల్లడించారు. అలాగే ఇది చదివింది ఎక్కువ సేపు గుర్తుంచుకోవడానికి, తిరిగి జ్ఞప్తికి తెచ్చుకోవడానికి మెదడుకు కావలసిన శక్తినిస్తుంది.పలు ఆరోగ్య సమస్యలు దూరం: కుంకుమ పువ్వు దృష్టి లోపాన్ని సరిచేసి కళ్లు స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. కీళ్ల నొప్పులను నివారించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అలాగే ఆర్థరైటిస్ సమస్య నుంచి విముక్తి కలిగిస్తుంది. ఒత్తిడి, రుతుసంబంధ సమస్యలు, ఆస్తమా, కోరింత దగ్గు ఇలా పలు రకాల సమస్యలను దూరం చేస్తుంది. కుంకుమ పువ్వు శరీరంలో రక్తపోటును తగ్గించి మానసిక ప్రశాంతతను చేకూరుస్తుంది. కండరాలకు విశ్రాంతినిస్తుంది. దీనిలో క్యాన్సర్‌ను నిరోధించే లక్షణాలున్నట్లు పలు పరిశోధనల్లో వెల్లడైంది.

**బిర్యానీలోనూ:** ఆహార పదార్థాల రుచి, వాసనను పెంచడానికి వాటి తయారీలో కుంకుమ పువ్వును ఉపయోగిస్తారు. ఉదాహరణకి ఖీర్, పలు రకాల స్వీట్లు, బిర్యానీ మొదలైన పదార్థాల తయారీలో దీన్ని వాడతారు.

**వెంటనే రంగు మారిందా!:** కుంకుమ పువ్వు చాలా ఖరీదైంది. కాబట్టి మీరు కొన్న ఉత్పత్తి అసలైనదా లేక కల్తీ జరిగిందా తెలుసుకోవడం చాలా ముఖ్యం. అదెలాగంటే చిటికెడు కుంకుమ పువ్వును గోరువెచ్చటి నీటిలో లేదా గోరువెచ్చటి పాలలో వేసి తక్షణమే రంగు మారుతుందో లేదో గమనించాలి. ఒకవేళ తక్షణమే రంగు మారినట్లయితే అది అసలైనది కాదని అర్థం. ఎందుకంటే కుంకుమ పువ్వు కలిపిన మిశ్రమానికి ముదురు ఎరుపు నుంచి గోల్డ్ కలర్ రావడానికి కనీసం 15 నిమిషాల సమయం పడుతుంది. అలాగే కొనేముందు ప్యాకింగ్ సరిగ్గా ఉందా లేదా, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ తదితర విషయాలు క్షుణ్ణంగా పరిశీలించడం చాలా ముఖ్యం.

# పురపోరుకు సర్వం సిద్ధం

**కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యల తప్పవని డీజీపీ వార్నింగ్**

**రేపు మున్సిపల్ ఎన్నికలు**

**ఎన్నికల నిర్వహణకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసు విభాగం**

**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరిక**



తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు పోలీసు విభాగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఓటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పెద్ద ఎత్తున బలగాలను అప్రమత్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ మినహా అన్ని ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కోడ్ అమలులో ఉందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు.

**20 అంతరాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుతున్న నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖ సరిహద్దులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 20 అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో 8, మహారాష్ట్రలో 5, కర్ణాటకలో 5, ఛత్తీస్‌గఢ్ లో 2 చెక్‌పోస్టుల ఏర్పాటు చేశారు. వీటితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మరో 55 అంతర్గత చెక్‌పోస్టులను సైతం ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

**ముందస్తు చర్యలు తీసుకున్నాం :** ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి నిఘా వర్గాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఇప్పటివరకు నగదుతో పాటు ఇతర వాటిలో రూ.3.09 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకుమన్నారు. అందులో రూ.1.29 కోట్ల నగదు, రూ.1.21 కోట్ల విలువైన మద్యం, 15.7 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇప్పటివరకు 142 ఎంసీసీ కేసులను నమోదు చేశామని ఆయన వివరించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని వివరించారు.

**కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షణ :** ఎన్నికల కోడ్ అమలు వచ్చిన తర్వాత 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకుమని డీజీపీ అన్నారు. సమస్యాత్మక వ్యక్తులుగా గుర్తించిన 4,318 మందిని మంచి ప్రవర్తన కోసం బైండ్ ఓవర్ చేశామని, పాత కేసుల్లో పరారీలో ఉన్న వారిపై 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశామని డీజీపీ స్పష్టం చేశారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 167 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ నిరంతరం విధుల్లో ఉంటునున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ స్టేషన్లలో భద్రత కోసం స్థానిక పోలీసులతో పాటు ఇతర శాఖల నుంచి అదనంగా 3,000 మంది బలగాలు విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100% వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని పోలీసులు ఏర్పాటు చేశామని, దీని వల్ల ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం :** ఓటర్లు ఎవరికీ భయపడకుండా, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీజీపీ శివధర్ రెడ్డి కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు."రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. 1,183 లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. 167 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ విధుల్లో ఉన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయి.

# మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య



నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 6వ వార్డు చందపూరులో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారు. 6వ వార్డు నుంచి గెలుపొందేందుకు మహదేవప్పకు ఎక్కువ అవకాశాలుండటంతో ఇతర పార్టీ నాయకులు బెదిరింపులకు గురి చేయడంతో భయభ్రాంతులకు లోనై ఉరి వేసుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి మృతి కారణంగా ఆరో వార్డు ఎన్నిక రద్దు చేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

**బెదిరింపులు, ఆరోపణలే :** మృతిచెందిన మహాదేవప్ప కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పరామర్శించారు. మహదేవప్ప ఆత్మహత్య ఘటనపై బీజేపీ చీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపులు, వేధింపులే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు.

**కాంగ్రెస్ నాయకులు అరాచకాలు చేస్తున్నారు :** మహదేవప్పది ఆత్మహత్య కాదు, కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమ సహనాన్ని పిరికితనంగా భావిస్తారా? అని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయని ధ్వజమెత్తారు. కార్యకర్తలారా ధైర్యంగా ఉండండి, నాయకత్వం అండగా ఉందని తెలిపారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

**రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి :** బీజేపీ ఎంపీ డి.కె.అరుణ మహదేవప్ప కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. మహదేవప్ప ఆత్మహత్య ఘటనను రాజ్యసభలో ప్రస్తావించినట్లు ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. కాంగ్రెస్ ఒత్తిడితో ఎస్టీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమని అన్నారు. ఈ ఘటనను కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహదేవప్ప ఆత్మహత్యపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని అన్నారు.

**తోపులాటలో కిందపడిన డీసీపీ :** మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యకు కాంగ్రెస్ కారణమంటూ బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ తోపులాటలో ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి కిందపడిపోయారు. పలువురు పోలీసులు, బీజేపీ కార్యకర్తలకు గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

**ఫిర్యాదు వచ్చింది :** మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మహదేవప్ప ఎటువంటి ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసిందని చెప్పారు.

## ఇచ్ఛాపురం-నెల్లూరు రైల్వేలైన్ 4 వరుసలకు పెంపు!

**జోరందుకోనున్న సరకు రవాణా**

**బుల్లెట్ రైళ్ల కారిడార్లతో ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రయోజనం**

**774 రైల్వే క్రాసింగ్స్ తొలగించేలా వంతెనల నిర్మాణాలకు చర్యలు**



ఏ రాష్ట్రమైనా అభివృద్ధి పథంలో నడవాలంటే అంతర్గత, బహ్య రవాణా వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలి. అలా ఉన్నప్పుడే సరుకు రవాణా, ఎగుమతులు, దిగుమతుల్లో మంచి ఫలాలందుతాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం రవాణా సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు రవాణా సేవల్ని పునరుద్ధరించింది. సరకు రవాణా వేగంగా చేసేందుకు ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు ఉన్న రైల్వే లైన్లు 4 వరుసలకు పెంచితే మంచి అవకాశాలుండనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ అంశం గురించి మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ఆయన మాట్లాడారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 774 రైల్వే లెవెల్ క్రాసింగ్స్ ఉన్నాయి. వాటిని తొలగించడం కోసం ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. వీటి నిర్మాణాలకు రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధుల కొరత ఉండదని, అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అధికారులకు సూచించారు. నిర్ణీత గడువు పూర్తయ్యే లోపు నిర్మాణాలు చేపట్టడానికి కావాల్సిన భూములు సేకరించేలా చూడాలని పేర్కొన్నారు. కలెక్టర్లు ఇది తమకు సంబంధం లేని విషయమని, లాజిస్టిక్ వ్యవహారం మాకెందుకు అని నిర్లక్ష్యం చేయకూడదని సీఎం హెచ్చరించారు.

**14 శాతం రవాణా ఖర్చే:** ఏ ఉత్పత్తికైనా ఎగుమతులకు అయినా రవాణా ఖర్చు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో చూసినట్లైతే ప్రస్తుతం ఉత్పత్తులకు సగటున 14 శాతం రవాణా ఖర్చు అవుతున్నట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. దీన్ని 7నుంచి 8 శాతానికి తగ్గించడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.ఈ క్రమంలో కొత్త రైల్వే ప్రాజెక్టులపై దృష్టి సారించిన కేంద్రప్రభుత్వం హైదరాబాద్- చెన్నై హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు లక్ష్యంగా పనులు చేపట్టింది. చెన్నై - రేణిగుంట వరకు ఒకటి రెండు మినహా లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేశారు. త్వరలో బుల్లెట్ రైళ్లు నడిపే ఆలోచన ఉన్న నేపథ్యంలో రైల్వే లైన్ల సంఖ్య పెంచాలని సంబంధిత అధికారులు చూస్తున్నారు.

**బుల్లెట్ రైళ్ల కారిడార్లు:** ఆంధ్రప్రదేశ్ మీదుగా బుల్లెట్ రైళ్ల కారిడార్లు ఏర్పాటైతే రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఏపీ మీదుగా ప్రయాణించే బుల్లెట్ రైళ్లు ఇవే

హైదరాబాద్ - అమరావతి - చెన్నై

హైదరాబాద్ -బెంగళూరు,

చెన్నై- బెంగళూరు

**లాజిస్టిక్స్ తప్పనిసరి:** జలమార్గాలు అత్యుత్తమమైనవి. తర్వాత రైలు, ఆపై రోడ్లు భవిష్యత్తులో రాష్ట్రానికి ఎయిర్‌వేస్ వస్తాయని సీఎం అన్నారు. ఏటా దాదాపు 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి చేస్తుండగా, నాలుగైదేళ్లలో ఇది 1,000 లక్షల టన్నులకు వెళ్తుందని సీఎం తెలిపారు. దీన్నంతటినీ అంతర్జాతీయ మార్కెట్‌కు చేర్చేలా లాజిస్టిక్స్ సదుపాయం ఉండాలని ఆయన వివరించారు. అనంతపురం జిల్లా నుంచి రైళ్లలో అరటి రవాణా చేస్తున్నారు. ఇలా అన్ని పంటలపై దృష్టి పెట్టాలన్నారు. సీ ప్లేన్స్‌లో మన రాష్ట్రం దేశంలోనే ఆదర్శం కానుందని చంద్రబాబు కోరారు.

## పార్లమెంటులో జరిగినదాన్ని చూసి యావత్ దేశం సిగ్గుపడుతోంది: కంగనా రనౌత్

**పార్లమెంట్‌లో ప్రతిపక్షాల తీరుపై కంగనా ఫైర్**

**విపక్షాలు అన్ని హద్దులు దాటాయని ఆరోపణ**

**రాహుల్ గాంధీ చర్యతో దేశం సిగ్గుపడుతోందని వ్యాఖ్య**

**ప్రధాని మోదీ భద్రతపై కంగనా ఆందోళన**

**సభలో కాగితాలు చించి స్పీకర్‌పై విసిరారని విమర్శ**



ప్రతిపక్షాలు అన్ని హద్దులు దాటి ప్రవర్తిస్తున్నాయని, పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలతో దేశం మొత్తం సిగ్గుపడుతోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం నాడు పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె, విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం లోక్‌సభలో రాహుల్ గాంధీ.. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే ఇంకా ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను చట్టవిరుద్ధంగా ప్రస్తావించారని కంగనా ఆరోపించారు. "రాహుల్ గాంధీ నిన్న ఒక అనధికారిక, చట్టవిరుద్ధమైన పుస్తకాన్ని సభకు తీసుకొచ్చి మొత్తం న్యాయవ్యవస్థను అవమానించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ కూడా స్పష్టం చేసింది" అని ఆమె తెలిపారు. ఈ పరిణామాలతో ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా ఇబ్బంది పడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు.ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు కుట్ర చేస్తున్నాయని కంగనా ఆరోపించారు. "వారు సభలో కాగితాలు చించి స్పీకర్‌పై విసరడం, టేబుళ్లపైకి ఎక్కడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి వాళ్లు ప్రధాని మోదీ చేతిలో నుంచి కాగితాలు లాక్కోరని, ఆయనపై దాడి చేయరని గ్యారెంటీ ఏంటి? ప్రధాని సభకు రావాలంటే మాకు దీనిపై హామీ కావాలి" అని ఆమె డిమాండ్ చేశారు. మహిళా ఎంపీలను అడ్డుపెట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడితే పార్లమెంట్ గౌరవం ఏమవుతుందని ఆమె ప్రశ్నించారు.ఇదిలా ఉండగా, కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరగకుండా విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంతో లోక్‌సభ మంగళవారం కూడా వాయిదా పడింది. "మాకు న్యాయం కావాలి" అంటూ కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేయగా, బడ్జెట్‌పై చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వారిని కోరారు.

## టీటీడీ ట్రస్టులకు భక్తుల భారీ విరాళాలు

**టీటీడీ ట్రస్టులకు హైదరాబాద్‌కు చెందిన భక్తుల నుంచి భారీ విరాళాలు**

**ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1 కోటి విరాళం**

**అన్నప్రసాదం, ఇతర ట్రస్టులకు మరో రూ.30 లక్షల అందజేత**

**టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి డీడీలు అందించిన దాతలు**

**దాతల కుటుంబాలకు ఛైర్మన్ కృతజ్ఞతలు, పండితుల ఆశీర్వచనం**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నడుస్తున్న పలు ట్రస్టులకు హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు భక్తులు భారీగా విరాళాలు అందించారు. వేర్వేరుగా వారు మొత్తం రూ.1.30 కోట్లను టీటీడీకి అందజేశారు.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన గుత్తా శ్రీ హర్షసాయి చౌదరి, టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1 కోటి విరాళంగా ఇచ్చారు. తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి, ఇందుకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)ను అందజేశారు. ఈ పవిత్ర కార్యానికి సహకరించిన దాత కుటుంబానికి ఛైర్మన్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.మరో ఘటనలో, హైదరాబాద్‌కే చెందిన స్మార్ట్ సాఫ్ట్‌వేర్, మోహన్ ఇండస్ట్రీస్ ఎండీ యలమంచిలి మదన్మోహన్ రావు రూ.30 లక్షల విరాళాన్ని అందజేశారు. శ్రీవారి ఆలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడికి ఆయన డీడీని అందించారు. ఈ మొత్తాన్ని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుతో పాటు ఇతర ట్రస్టులకు వినియోగించాలని దాత కోరారు. అనంతరం, దాత మదన్మోహన్ రావు కుటుంబ సభ్యులకు పండితులు వేదాశీర్వచనం అందించగా, ఛైర్మన్ వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు కూడా పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com